క్లుప్తంగా

దశభుజ గణపతికి పూజలు



రాయదుర్గం టౌన్: పట్టణంలోని దశభుజ గణపతి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

ఈద్గా మైదానంలో పరిశుభ్రత పనులు



పనులను పరిశీలిస్తున్న మైనార్టీ నాయకులు

ఉరవకొండ: స్థానిక ఈద్గా, ఖబరస్తాన్‌లో ఈ నెల 29న పవిత్ర బక్రీద్ పండుగ సందర్భంగా సామూహిక ప్రార్థనలు నిర్వహించుకునేందుకు సర్పంచ్ లలితమ్మ, ఈట గౌస్‌సాహెబ్ ఆధ్వర్యంలో ఆదివారం పరిశుభ్రత పనులు ప్రారంభించారు. పనులను జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ మీరంబాషా, కోఆప్షన్ సభ్యులు పామిడిసలీం, సచివాలయ కన్వీనర్ ఆసీఫ్, నాయకులు వడ్ల సలీం, తాజుద్దీన్, మద్దికెర అన్వర్, వన్నూర్ సాబ్, శర్మాస్, జిలాన్, అయ్యూర్‌దాదు తదితరులు పరిశీలించారు. ఈద్గా రహదారి పక్కన ముళ్లకంపలు తొలగించి, గుంతకల్లు పద్ద రోడ్డుకు మరమ్మతు చేయించారు.

రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా హనుమేష్



వజ్రకరూరు: మండలంలోని వెంకటాంపల్లి గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి (గ్రేడ్ 6)గా విధులు నిర్వహిస్తున్న వి.హనుమేష్ గ్రామ/వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలోని ఏపీ ఎన్జీఓ భవనంలో గ్రామ/వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన హనుమేష్‌ను పలువురు అభినందించారు.

దేశాభివృద్ధికి తోడ్పడాలి




శిక్షణ పొందుతున్న క్యాడెట్లు

కూడేరు: దేశభక్తిని అలవర్చుకొని దేశాభివృద్ధికి పాటుపడాలని క్యాడెట్లకు ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ సందీప్ ముంద్రా పిలుపునిచ్చారు. కూడేరు మండలంలోని ఎన్‌సీసీ నగర్‌లో 6వ ఆంధ్రా బెటాలియన్ సీఏటీసీ-1 శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. ఆదివారం క్యాడెట్లకు ఆప్టికల్ (అడ్డంకులను అధిగమించడం)పై, మ్యాప్ రీడింగ్‌పై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో క్యాంప్ కమాండ్ మాట్లాడారు. కార్యక్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాకు చెందిన 500 మంది క్యాడెట్లు, మేజర్ సుఖ్‌దేవ్, అధికారులు రాకేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార బోర్డులో పేర్ల మార్పు

సాక్షి ఎఫెక్ట్..



బోర్డులో ప్రస్తుత ఏపీఎం రాజశేఖర్ పేరు నమోదు చేసిన దృశ్యం

కూడేరు: మండల వైకేపీ ఏపీఎం రామ్మోహన్ రెండేళ్ల క్రితం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వచ్చిన మధుసూదన్ బదిలీపై వెళ్లారు. ఆ స్థానంలో రాజశేఖర్ వచ్చినా వైకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమాచార హక్కు బోర్డులో ఏపీఎం రామ్మోహన్ పేరే ఉండేది. సాక్షి దిన పత్రిక శనివారం 'ఇదేం సమాచారం' అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. దీంతో వైకేపీ అధికారుల్లో చలనం వచ్చింది. ఆదివారం సమాచార హక్కు బోర్డులో ప్రస్తుత ఏపీఎం పేరు రాజశేఖర్, ఏరియా కో ఆర్డినేటర్ పేరు మద్దిలేటి పేర్లను నమోదు చేశారు. దీంతో మండలవాసులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఉరవకొండ: మోపిడి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదివారం ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. చిన్నముస్టూరుకు చెందిన వెంకటేష్ ఆమిద్యాలలో కూలి పనులు ముగించుకుని ద్విచక్రవాహనంలో వస్తుండగా.. మోపిడి గ్రామం వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడింది. ఘటనలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 వాహనంలో క్షతగాత్రున్ని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పండుగలా 'జగనన్న సురక్ష' సర్వే

- అర్హులందరికీ లబ్ధి చేకూర్చేలా చర్యలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు

రాయదుర్గం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడం, ప్రజా సమస్యలను సంతృప్తి స్థాయిలో పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తీసుకొచ్చిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని 256 వార్డు/గ్రామ సచివాలయాల పరిధిలో పండుగలా మొదలైంది. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, జగనన్న అభిమానులు అంతా ఏకమై కదిలారు. ప్రతి కుటుంబాన్నీ కలిసేలా కార్యచరణ చేపట్టారు. అర్హులై ఉండి లబ్ధి చేకూరని వారితో మాట్లాడుతూ.. కావాల్సిన జిరాక్సులు స్వీకరిస్తూ టోకన్లు అందించే కార్యక్రమాన్ని విస్తృతం చేశారు. కుల, ఆదాయ, జనన, మొదలైన 11 రకాల సర్టిఫికెట్లతో పాటు నవరత్న పథకాలు సద్వినియోగం చేసేలా కీలక చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమం ఊరూర ఊపందుకోవడంతో పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమ ప్రదాత సీఎం జగన్‌కు జేజేలు పలుకుతున్నారు.

జన్మభూమి కమిటీల పెత్తనంతో పేదలకు ఇబ్బంది

టీడీపీ హయాంలో పథకాలు పొందాలన్నా..? సర్టిఫికెట్ కావాలన్నా పేద ప్రజలు పనులన్నీ మాని మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. జన్మభూమి కమిటీ సభ్యులు పేదల రక్తాన్ని జలగలా పీల్చేవారు. నేడు ఆ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. సీఎం జగన్ అమల్లోకి తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణలతో పేదల జీవితాల్లో మార్పులు మొదలయ్యాయి. నాలుగేళ్లకే 99 శాతం హామీలు నెరవేర్చిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కింది. సాంకేతిక కారణాలు, ఇతర ఇబ్బందుల వల్ల ఎక్కడైనా అర్హులు మిగిలిపోయి ఉంటే.. వారిని కూడా గుర్తించి న్యాయం చేసేలా 'జగనన్న సురక్ష'ను అమల్లోకి తీసుకొచ్చారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని అర్హుల ఎంపిక బాధ్యతను అధికారులు, పాలకులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.



డి హీరేహాళ్ మండల కేంద్రంలో సమస్యలపై ఆరా తీస్తున్న సచివాలయ సిబ్బంది

పక్కాగా అమలు



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం డివిజన్‌వ్యాప్తంగా పక్కాగా అమలయ్యేలా చర్యలు చేపట్టాం. అర్హులకు గుర్తించేందుకు ఇంటింటా అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, గృహసారథులు వెళ్లి దరఖాస్తులు స్వీకరించే విషయంపై శిక్షణ ఇచ్చి పంపించాం. అర్హత ఉండి పథకాలు అందలేదనే వారికి సత్వరం మంజూరు పత్రాలు ఇచ్చే కార్యాచరణ చేపట్టాం. కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాం.

– నిషాంత్‌రెడ్డి, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

పది రోజుల పాటు ప్రజల్లోనే..



గృహ సందర్శన కార్యక్రమం మరింత వేగవంతం చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశాం. ఈ పది రోజుల పాటు ప్రతి ఒక్కరూ ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలి. సర్వీసు ఫీజు లేకుండా ఏకంగా 11 రకాల ధ్రువీకరణ పత్రాలు, నవరత్న పథకాలు ఇంటి ముంగిటకే వెళ్లి అందజేస్తున్న ప్రభుత్వం దేశంలోనే వైఎస్సార్‌సీపీ మాత్రమే. టీడీపీసహా దుష్ట చతుష్టయ ఎన్ని కుట్రలు పన్నినా జనం నుంచి జగన్‌ను దూరం చేయలేరు.

– కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

'జగనన్న సురక్ష'తో మెరుగైన సేవలు

ఉరవకొండ: రాష్ట్రంలో ప్రజల జీవన స్థితిగతులపై అత్యంత శ్రద్ధ, సున్నితమైన పరిశీలన, అవగాహనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో జగనన్న సురక్ష, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాలపై పార్టీ ప్రజాప్రతినిధులు, జేసీఎస్ కన్వీనర్లు, పార్టీ ముఖ్యనేతలతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం పార్టీ ప్రజాప్రతినిధులతో కలసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'జగనన్న సురక్ష' ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల్లోకి మరోసారి వెళ్లి ఇంకా అర్హులైన వారిని గుర్తించి సేవలు అందించేందుకు శ్రీకారం చుట్టారన్నారు. సంక్షేమ పథకాలకు ఏ ఒక్కరూ దూరం కాకూడదన్న లక్ష్యంతో జగనన్న సురక్షను ప్రతిష్టాత్మకంగా చేపట్టారన్నారు. 11 రకాల సేవలు ప్రజలకు ఉచితంగా అందించడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంటి ముందుకు వస్తున్నారన్నారు.

నాలుగేళ్లలో నియోజకవర్గానికి రూ.3 వేల కోట్లు ఖర్చు

నియోజకవర్గంలో గడచిన నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు సంబంధించి రూ.3 వేల కోట్లు ఖర్చు పెట్టిందన్నారు. ఇందులో రూ.వంద కోట్లు రైతుల సంక్షేమానికి వినియోగించామన్నారు. గడప గడప కార్యక్రమంలో గుర్తించిన అత్యవసర పనులు చేయడానికి రూ.14 కోట్లు ప్రభుత్వం నియోజకవర్గానికి విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, ఎంపీపీలు చంద్రమ్మ, నారాయణరెడ్డి, జెడ్పీటీసీలు ఏసీ పార్వతమ్మ, హనుమంతు, వైస్ ఎంపీపీ నరసింహులు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోనాథ్, నాయకులు కరణం భీమిరెడ్డి, బసవరాజు, బసన్న, భీమిరెడ్డి, ఆసీఫ్, వడ్ల షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

పేదల అభ్యున్నతే సీఎం లక్ష్యం

బొమ్మనహాళ్: పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గౌనూరు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. అలాగే ప్రజల సమస్యలు తెలుసుకుని.. వెంటనే పరిష్కరించాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్నా చాలా మంది కొన్ని సర్టిఫికెట్లు లేక పథకాలను అందుకోలేకపోతున్నారన్నారు. అందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలతో లబ్ధిదారుల అకౌంట్లలో నేరుగా నగదు జమ చేయడం ఇష్టం లేని టీడీపీ నాయకులు రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేస్తున్నారంటూ విమర్శలకు దిగారని మండిపడ్డారు. ఏదో ఒక విధంగా సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు చేరకుండా చేయాలన్నదే వారి ధ్యేయమని విమర్శించారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో టీడీపీ అధినేత చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని, ప్రజలెవరూ నమ్మొద్దన్నారు. గతంలో 600 హామీలిచ్చి మోసం చేసిన చరిత్ర బాబుదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేశారని, వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆయనకు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, సర్పంచ్ ముల్లంగి భాస్కర్, వైస్ ఎంపీపీ రమేష్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, యోగేశ్వరరెడ్డి, లింగన్న, వన్నూరుస్వామి, తిప్పేస్వామి, వన్నూరుస్వామి, నాగరాజు, మారుతి తదితరులు పాల్గొన్నారు.



గౌనూరులో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రెండో రోజూ కొనసాగిన 'జగనన్న సురక్ష'

రాయదుర్గం రూరల్: మండలంలోని మెచ్చిరి గ్రామంలో ఆదివారం రెండో రోజు జగనన్న సురక్ష కార్యక్రమం కొనసాగించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచివినతులు స్వీకరించారు. అర్హత ఉండి పథకాలు అందలేదనే వారి జాబితా, అందుకు గల కారణాలు , సర్టిఫికెట్లు కావాలనే వారి జాబితా తయారు చేస్తున్నట్లు తహసీల్దార్ మారుతి తెలిపారు. జూలై 1 నుంచి నిర్వహించే గ్రామసభల్లో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అలాగే జుంజురాంపల్లి గ్రామంలో ఎంపీడీఓ కొండయ్య ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం కొనసాగించారు. వజ్రకరూరు: మండలంలోని చాబాల, ధర్మపురి గ్రామాల్లో జగనన్న సురక్ష పథకంపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి జగనన్న సురక్ష పథకంపై వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ విజయలలిత, సర్పంచులు సోమశేఖర్‌రెడ్డి, మల్లెల జగదీష్, మాజీ వైస్ ఎంపీపీ నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

రాయదుర్గం రూరల్: మండలంలోని 19 గ్రామ పంచాయతీలు, ఆరు మజరా గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై 17వ విడత సామాజిక తనిఖీ ఆదివారం ప్రారంభించినట్లు ఏపీఓ నీరజ తెలిపారు. జూలై 5 వరకూ నియమింపబడిన బృందాలు సామాజిక తనిఖీ నిర్వహిస్తాయన్నారు. 6వ తేదీ బహిరంగ ప్రజావేదిక ఉంటుందన్నారు. స్టేట్ రిసోర్స్ పర్సన్ లోకేష్, ఏపీడీ జయకుమార్, ఎంపీడీఓ కొండయ్య, ఈసీ భారతి పర్యవేక్షణలో జిల్లా రీసోర్స్ పర్సన్లు సామాజిక తనిఖీలు నిర్వహిస్తారన్నారు. మండలంలో మొత్తం 653 పనులకు రూ.8,93,73,059 ఖర్చు చేశారన్నారు. జిల్లా రీసోర్స్ పర్సన్లు ప్రమీల, లక్ష్మీనారాయణమ్మ, శివ, రవికుమార్, సుబ్బరాయుడు, భారతి, వీరభద్రారెడ్డి, సురేష్ బాబు సామాజిక తనిఖీ నిర్వహిస్తారన్నారు. టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు డీఆర్పీలకు సహకరించాలని ఆమె కోరారు.

విద్యార్థినికి ఆర్థికసాయం

వజ్రకరూరు: మండలంలోని రూపానాయక్‌తండాలో చిన్నతనంలోనే తల్లిని కోల్పోయిన ఆర్.స్వప్నబాయి విద్యాభ్యాసానికి గ్రామానికి చెందిన జి.డేవిడ్‌నాయక్ రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. బాగా చదువుకుని గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని వక్తలు సూచించారు. కార్యక్రమంలో బంజారా సంఘంజాతీయ నాయకుడు కేశవనాయ, ఉరవకొండ సిఐ శేఖర్, జెడ్పీ మాజీ సభ్యుడు తులసీదాస్‌నాయక్, గ్రామపెద్దలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

గడువు పొడిగించండి

కుందుర్పి: జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద చిన్న, సన్నకారు రైతులకు డ్రైల్యాండ్ హార్టికల్చర్ పథకానికి సంబంధించిన దరఖాస్తు గడువును ఈ నెలాఖరు వరకూ పొడగించాలని రైతులు ఆదివారం కోరారు. నాలుగేళ్లుగా సమృద్ధిగా వర్షాలు పడుతుండడంతో రైతులు పండ్లతోటల సాగుపై మొగ్గుచూపుతున్నారని రైతులు తిప్పేస్వామి, హరికృష్ణ, ఓబన్న, హనుమంతరాయుడు తదితరులు తెలిపారు.

సుదీర్ఘ కల.. నెరవేరిన వేళ!



గతంలో రోడ్డు దుస్థితి



పూర్తయిన రహదారి

రాయదుర్గం: బొమ్మనహాళ్ మండలం 'గౌనూరు' గ్రామస్తుల రహదారి గోడు ఎట్టకేలకు నెరవేరింది. అక్కడో ఊరుందని చెప్పుకోవడం తప్పా.. దాని అభివృద్ధి గురించి మాటెత్తిన నాయకుడే ఇన్నాళ్లూ లేడంటే అతిశయోక్తి లేదు. గ్రామం ఏర్పాటై వందేళ్లు దాటినా సరైన దారి లేక హెచ్‌ఎల్‌సీ కెనాలే ఇన్నాళ్లు మార్గమైంది. బళ్లారి– కళ్యాణదుర్గం ప్రధాన రహదారి నుంచి గౌనూరు గ్రామం వరకూ ఐదు కిలోమీటర్ల దారి అడుగడుగునా గుంతలుపడి ప్రయాణికుల పాలిట నరకప్రాయమైంది. వాహనాల మాట అటుంచినా, కనీసం పాదాచారులు కూడా వెళ్లలేని స్థితికి చేరింది. దివంగత ముఖ్యమంతి వైఎస్సార్ హయాంలో కొంత వరకు గ్రావెల్ పనులు చేపట్టి ఊరటనిచ్చినా, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు పూర్తి నిర్లక్ష్యం చేశాయి. తగ టీడీపీ హయాంలో మంత్రిగా ప్రాతినిధ్యం వహించిన కాలవ శ్రీనివాసుల దృష్టికి పలుమార్లు సమస్యను తీసుకెళ్లినా పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్తులు మండిపడ్డారు.

విప్ దృష్టికి సమస్య..

రోడ్డు సమస్యను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి గౌనురు ప్రజలు ఇటీవల విప్ కాపు రామచంద్రారెడ్డిని కలసి విన్నవించారు. విప్ వెంటనే ఇంజినీరింగ్ అధికారులతో ఎస్టిమేట్ తయారు చేయించి ఏఐఐబీ పథకం ద్వారా 4.9 కిలోమీటర్లకు రూ.2.36 కోట్ల నిధులు మంజూరయ్యేలా కృషి చేశారు. ఈ నిధులతో తారు రోడ్డును పూర్తి చేయించారు. అంతేకాక ప్రతి వీధికీ సీసీ రోడ్డు ఏర్పాటు చేయించి ప్రధాన రహదారికి అనుసంధానం చేయించారు. రోడ్డు సమస్య పరిష్కారమవడంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి , విప్ కాపు రామచంద్రారెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామంటూ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు మున్సిపల్ సమావేశం

రాయదుర్గంటౌన్: స్థానిక పురపాలక సంఘంలోని కౌన్సిల్ హాల్‌లో సోమవారం ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమావేశంలో పట్టణంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజా సమస్యలపై చర్చిస్తామన్నారు. కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు, విభాగాల వారిగా అధికారులు హాజరు కావాలన్నారు.

ఉపాధ్యాయురాలిపై ఫిర్యాదు

కణేకల్లు: మండలంలోని బ్రహ్మసముద్రం జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు టీచర్‌గా పనిచేస్తున్న శారదా పద్మావతి అన్యమత ప్రచారం చేస్తోందంటూ గ్రామస్తులు కలెక్టర్ గౌతమి, డీఈఓ సాయిరాంకు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈమె క్రిస్టియన్ కావడంతో వేసవి సెలవుల కంటే ముందుగా స్కూల్‌లో మత ప్రచారానికి తెరలేపింది. రోజురోజుకూ ఆమె నస ఎక్కువ కావడంతో విద్యార్థులు తల్లిదండ్రులకు చెప్పారు. పాఠశాల పునఃప్రారంభం తర్వాత కూడా ఆమె తన తీరు మార్చుకోలేదు. ఆమె బోధనలు వినని విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ మానసిక వేదనకు గురిచేస్తున్నట్లు సమాచారం. విద్యార్థుల తల్లిదండ్రులందరూ మూకుమ్మడిగా వెళ్లి 'మేడమ్... మీ ప్రవర్తన బాగో లేదు. పద్ధతి మార్చుకోవాలి' అని విన్నవించగా ఏమాత్రం తగ్గని ఆమె గ్రామస్తులపైనే మండిపడ్డారు. నా భర్త ఓ పెద్ద టీవీ ఛానల్‌కు రిపోర్టర్... నా జోలికొస్తే మీ అంతుచూస్తానంటూ బెదిరించింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్, డీఈఓను కలిసి రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆమెను బదిలీ చేయకపోతే తమ పిల్లలను బడికి పంపమని ఖరాఖండిగా చెప్పారు. ఈ విషయమై డీఈఓ సాయిరాంకు వివరణ కోరగా ఈ ఘటనపై విచారణ జరపాలని డిప్యూటీ డీఈఓకు ఆదేశించామన్నారు. విచారణ తర్వాత చర్యలు తీసుకొంటామన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి

రాయదుర్గంటౌన్: ప్రధానమంత్రి మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని జిల్లా పార్లమెంటు కన్వీనర్ చిరంజీవిరెడ్డి, పార్లమెంటు ఇన్‌చార్జ్ శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. గృహ సంపర్క్ అభియాన్ కార్యక్రమం కింద రాయదుర్గం పట్టణంలో బీజేపీ నాయకులు ఇంటింటా పర్యటించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వసుంధర, పట్టణ అధ్యక్షుడు అంభోజీరావు, మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, ఓబీసీమోర్చా అధ్యక్షుడు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

కుందుర్పి: పొలంలో విత్తనం విత్తే విషయంలో ఆదివారం మలయనూరుకు చెందిన ఇరువర్గాల వారు ఘర్షణ పడి స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసులు పెట్టుకున్నారు. మలయనూరు రెవెన్యూ గ్రామంలోని సర్వే నెంబర్ 233-3లో 4.33 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి ప్రస్తుతం ఈరమ్మ అనే మహిళ పేరున ఉంది. అయితే తనకు 2005లోనే రిజిస్ట్రేషన్ ఉందని శ్రీనివాసులు అనే రైతు శనివారం ఆ పొలంలో విత్తనం వేశాడు. విషయం తెలుసుకున్న ఈరమ్మ తన భూమిలో విత్తనం వేసేందుకు మీరెవరని.. ఆదివారం పొలాన్ని దున్నేయడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా ఈరమ్మ కుటుంబానికి చెందిన వారు తనను కట్టెలతో చితకబాదారని, న్యాయం చేయాలని శ్రీనివాసులు కోరాడు.

పాఠకులకు పుస్తకాలు అందుబాటులో ఉంచండి

కళ్యాణదుర్గం: గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు అన్నిరకాల పుస్తకాలనూ అందుబాటులో ఉంచాలని గ్రంథాలయసంస్థ కార్యదర్శి రమ సూచించారు. ఆదివారం కళ్యాణదుర్గంలోని గ్రంథాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో పలు రికార్డులను తనిఖీ చేశారు. గ్రంథాలయంలో పాఠకుల సభ్యత్వాన్ని పెంచాలని గ్రంథాలయ అధికారి శ్రీనివాసులుకు సూచించారు. 2016-2017 నుంచిడి గ్రంథాలయ బకాయిలు వసూళ్లు కాలేదని, వెంటనే మున్సిపల్ కమిషనర్‌తో చర్చించి బకాయి వసూళ్లకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఉమామహేశ్వరి, పాఠకులు పాల్గొన్నారు.

కంబదూరు: గ్రంథాలయానికి వచ్చే ప్రతి పాఠకుడికి అవసరమైన ప్రతి పుస్తకాన్ని అందుబాటులో ఉంచుతామని గ్రంథాలయ జిల్లా కార్యదర్శి రమ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అక్కడ ఉన్న రికార్డులను పరిశీలించి గ్రంథాలయాధికారి సత్యంబాబుతో వివరాలను అడిగి తెలుసుకున్నారు.

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని అనంతపురం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి పి .రమా ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో పలు రికార్డులను పరిశీలించి సౌకర్యాలపై ఆరాతీశారు. పాఠకులకు ఇబ్బందులు కలగకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎర్రిస్వామి , పాఠకులు పాల్గొన్నారు.



కళ్యాణదుర్గం: రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా కార్యదర్శి రమ

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కుందుర్పి: మండలంలోని బెస్తరపల్లి ఉన్నత పాఠశాలలో 1989–90 పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. గ్రామంలో ఉదయం తప్పెట్లు, మేళ తాళాలతో ర్యాలీ నిర్వహించిన పూర్వ విద్యార్థులు ఉన్నత పాఠశాల ఆవరణలో సమావేశం ఏర్పాటు చేశారు. అప్పటి గురువులు, మిత్రులతో కలసి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మరియప్ప, సుబ్బరామప్ప, నజీర్, ఫణిభూషణ్, పూర్వ విద్యార్థులు మంజునాథ్, బాబాసాహెబ్, రాజగోపాల్, ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అక్కులప్ప, సన్నోబిశేసు తదితరులు పాల్గొన్నారు.

నేడు' గడప గడపకూ మన ప్రభుత్వం

బొమ్మనహాళ్: మండలంలోని శ్రీధరఘట్టలో సోమవారం ఉదయం 6 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ పద్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.ఈశ్వరరెడ్డి, సర్పంచ్ యోగేశ్వరరెడ్డి ఆదివారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు హాజరు కావాలన్నారు.

వజ్రకరూరు: మండలంలోని గంజికుంటలో సోమవారం ఉదయం 9 గంటలకు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జేసీఎస్ మండల కన్వీనర్ రాచన్నగౌడ్, గ్రామ సచివాలయ కన్వీనర్ రామాంజనేయులు ఆదివారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరు కావాలన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఎస్‌వీజీఎం డిగ్రీ కళాశాలలో అనంతపురానికి చెందిన మమత హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. శిబిరంలో 200 మంది రోగులకు వైద్యులు ప్రణీత్‌రెడ్డి, ఆర్‌పీ రాఘవేంద్రరాజు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేనేజర్ బసవరాజు, ప్రిన్సిపాల్ జయరామురెడ్డి, అధ్యాపకులు కాంతరావు, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి చేయూత

కంబదూరు: మండలంలోని రాళ్లపల్లి గ్రామానికి చెందిన కొల్లమ్మకు చర్చి సభ్యులు ఆర్థిక సాయం చేశారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స చేయించుకోవడానికి ఆర్థికస్తోమత లేక ఆదివారం ఆమె కంబదూరు సీఆండ్‌ఐజీ మిషన్ చర్చిలో సంఘ సభ్యులకు సమస్యను తెలియజేసింది. చర్చి సభ్యులు వెంటనే స్పందించి వైద్య చికిత్సల కోసం రూ.8,400 అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో పాస్టర్ జేమ్స్, సెక్రటరీ ప్రభాకర్, ట్రెజరర్ జోషఫ్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ జోయెల్, జాయింట్ ట్రెజరర్ విల్సన్, డికెన్ మెంబర్లు జయరాజు, కుమార్, బాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యం ప్యాకెట్ల పట్టివేత

గుమ్మఘట్ట: మండలంలోని బీటీపీ గ్రామ సమీపంలో కురుబ రెడ్డప్ప నుంచి 80 కర్టాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సునీత ఆదివారం తెలిపారు. గుమ్మఘట్ట గ్రామానికి చెందిన రెడ్డప్ప కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తుండగా అరెస్టు చేశామన్నారు. మద్యాన్ని సీజ్ చేసి, నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఆమె తెలిపారు. కర్ణాటక మద్యాన్ని ఎవరైనా విక్రయించినా, ప్రోత్సహించినా కేసులు నమోదు చేస్తామని ఆమె హెచ్చరించారు.